రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త

## చినుకు పడితే చీకటే.. నైట్ అంతా దోమలతో యుద్ధమే..

### -కేశంపేట విద్యుత్ అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం

**కేశంపేట, జూన్ 12, ప్రభాతవార్త:**

కేశంపేట మండలపరిధిలోని కాకునూరు, సంతాపూర్, కోనయపల్లి, వేములనర్వ, గ్రామ పంచాయతీ లోని చౌదరిగూడ, బల్లురాలతండా, కంకరలాతండా, వేములనర్వ గ్రామాలలో చిన్నపాటి గాలి వీచినా, చినుకుపడ్డా, గ్రామాలు అంధకారంలోకివెళ్తున్నాయి. విషయాన్ని విద్యుత్ అధికారులదృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నించినా విద్యుత్ కార్యాలయం లైన్మెన్ల చరవాణీలు ఎప్పుడూ స్విచ్ ఆఫ్‌గానే ఉంటాయి. చరవాణిలో ఎప్పుడో ఒకప్పుడు కలిసినా ఎవరూ స్పందించడంలేదు. వేములనర్వ గ్రామపరిధిలో గత ఆరునెలల కిందట 24గంటల కరెంటు ఇచ్చేందుకు ఎస్టిమేషన్ వేసిన అధికారులు నిమ్మకు నీరు ఎత్తినట్లు వ్యవహరిస్తున్నారని కరెంటుమాత్రం ఇవ్వడంలేదని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తంచేశారు. విద్యుత్ అధికారులను నిలదీస్తే కాంట్రాక్టర్‌పై, కాంట్రాక్టర్‌ను అడిగితే విద్యుత్ అధికారులపై ఒకరిపై ఒకరు చెప్పుకుంటూ కాలయాపనచేస్తున్నారే తప్ప గ్రామాలకు విద్యుత్ సరఫరాను సక్రమంగా అందించటం మాత్రం చేయటంలేదు. ఇకనైనా విద్యుత్ అధికారులు స్పందించాలని హెచ్చరించారు.

## భారత కమ్యూనిస్టు పార్టీ 12వ మండల మహాసభలు

**మొయినాబాద్, జూన్ 12, ప్రభాతవార్త:**

జూన్ 15న భారత కమ్యూనిస్టు పార్టీ 12వ మండల మహాసభలు విజయవంతం చేయాలని సిపిఐ మండల కార్యదర్శి కె.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. గురువారం ఆయన మొయినాబాద్ మున్సిపాలిటీ లోని ముఖ్య కార్యకర్తలతో సమావేశం ఏర్పాటుచేశారు. వారితో చర్చించిన అనంతరం వారు పత్రికా సమావేశాన్ని ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 15వతేదీన భారత కమ్యూనిస్టు పార్టీ మొయినాబాద్ మండలకేంద్రంలో 12వ మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మహాసభకు జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు నియోజకవర్గం ఇన్‌చార్జ్ కె.రామస్వామి హాజరవుతున్నారన్నారు. పార్టీనాయకులు, గ్రామకార్యదర్శులు, కార్మికులు, కర్షకులు ప్రజాసంఘాల నాయకులు, పార్టీశ్రేయోభిలాషులు అధికసంఖ్యలోపాల్గొని మహాసభను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో మండల సహాయకార్యదర్శి, జహంగీర్, బిటిసి మండల నాయకుడు ప్రభాకర్, ఎఐటియుసి మండలనాయకుడు యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూసుకోవాలి

### -జిల్లా అదనపు కలెక్టర్ ఎం.సుధీర్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, జూన్ 12, ప్రభాతవార్త:**

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉంటూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ ఎం.సుధీర్ అధికారులకు సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో దోమలద్వారా సంక్రమించే వ్యాధుల నియంత్రణకై జిల్లా సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈసందర్భంగా అధనపు కలెక్టర్ ఎం.సుధీర్ మాట్లాడుతూ, వర్షాకాలంలో దోమకాటు వల్ల మలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా లాంటి వ్యాధులు రాకుండా తగుజాగ్రత్తలు తీసుకోవాలని, సీజనల్ వ్యాధులపై ప్రణాళికాబద్ధంగా కార్యాచరణ రూపొందించుకొని ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆయన తెలిపారు. వసతిగృహాలు, పాఠశాలల్లో ప్రత్యేకంగా ఆరోగ్యశిబిరాలు నిర్వహించాలని ముందస్తుగానే జ్వరము, దగ్గు, జలుబుకు సంబంధించిన మందుల ు అందుబాటులో ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని ఆయన వైద్య అధికారులకు సూచించారు. ప్రతిరోజు ఇంటింటి సర్వే నిర్వహించి ఎలాంటి వ్యాధికి గురయ్యారో నిర్ధారణ చేసి మందులు అందించాలని ఆయన తెలిపారు. ప్రతిశుక్రవారం డ్రై డేగా పాటించాలని, నీటి ట్యాంకుల ు ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేస్తూ త్రాగునీటిని అందించాలని, గ్రామాల్లో మురుగు నీరు నిలవకుండా, పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచుకునేవిధంగా ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ప్రజల ు, స్వచ్ఛందసంస్థల భాగస్వామ్యంతో సీజనల్ వ్యాధుల ు నివారించే అన్ని జాగ్రత్తలు చేపట్టాలని ఆయన తెలిపారు. గ్రామాల్లో డాక్టర్లు, ఆశావర్కర్లు ఎప్పుడూ అందుబాటులో ఉండేవిధంగా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన తెలిపారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజల సౌకర్యార్థం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని, సమాచార నిమిత్తం 9702705161 క ు సంప్రతించవలసిందిగా అదనపు కలెక్టర్ సూచించారు. సమావేశంలో డిటిడిఓ కమలాకర్‌రెడ్డి, డిబిసిడిఓ ఉపేందర్, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి శంకర్‌నాయక్, డిప్యూటీ డిఎంహెచ్ఓ రవీంద్రయాదవ్, పలుశాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## షాద్‌నగర్ మెయిన్‌రోడ్డు విస్తరణకు మార్కింగ్

### -రోడ్డుకు ఇరువైపులా 75 ఫీట్లు తొలగించేందుకు రంగం సిద్ధం



రోడ్డు విస్తరణకు మార్కింగ్ వేస్తున్న మున్సిపల్, ఆర్‌అండ్‌బి అధికారులు

**షాద్‌నగర్, జూన్ 12, ప్రభాతవార్త:**

షాద్‌నగర్ పట్టణంలోని మెయిన్ రోడ్డు విస్తరణకు సంబంధించి మున్సిపల్ కమిషనర్ సునీత ఒక అడుగు ముందుకు వేశారు. రోడ్డుకు ఇరువైపులా 75ఫీట్ల చొప్పున తొలగించి రహదారి విస్తరణ చేపట్టాలనే ప్రతిపాదనను వ్యాపారులముందుకు తీసుకెళ్లనున్నారు. ఇందుకు సంబంధించి గురువారం ఆర్‌అండ్‌బి అధికారులతో కలిసి మార్కింగ్‌వేశారు. పట్టణంలోని ప్రధాన కూడలి నుండి రైల్వేస్టేషన్ వరకు ఉన్న ప్రధాన రహదారి మీదే వ్యాపారాలు సాగేవి. ఇప్పుడు ఆ వ్యాపారాలు పరిగిరోడ్డు, పాత జాతీయరహదారి వైపు విస్తరించాయి. అయితే ప్రధాన రహదారిలో గతంలో ఒక విధానం లేకుండా నిర్మాణాలు జరగడంతో ఇరుకుగా మారింది. ఇక్కడకు వ్యాపారాల నిమిత్తం వచ్చే జనం, మరోవైపు వాహనాల తాకిడితో నిరంతరం రద్దీగా ఉండేది. వర్షాకాలంలో రోడ్డుపై నీరు నిలిచిపోయి సమస్యలు ఏర్పడుతున్నాయి. మున్సిపల్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్, ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌తో పాటు ఒక సినిమా థియేటర్, ఆసుపత్రుల వంటికి ఈ రోడ్డుపై ఉండడంతో రద్దీ నానాటికీ పెరుగుతోంది. ఈనేపథ్యంలో రోడ్డు విస్తరణ చేపట్టాలని మున్సిపల్ అధికారులు సంకల్పించారు.

## తాండూరు పట్టణ సమగ్ర అభివృద్ధికి కృషి

### -ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి


అభివృద్ధి పనులకు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

**తాండూరు, జూన్ 12, ప్రభాతవార్త:**

తాండూరు పట్టణ సమగ్ర అభివృద్ధికి కృషి చేయడం జరుగుతుందని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి తెలిపారు. గురువారం తాండూరు పట్టణంలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ప్రారంభించారు. పట్టణంలోని విలియంమూన్ చౌరస్తాలో రూ.21లక్షలతో ఆర్టీఓ కార్యాలయం నుండి రాయల్ కాంటా వరకు, ఆదర్శనగర్ పాతకుంటలో రూ.2కోట్ల వ్యయంతో వినాయక కన్వెన్షన్ నుండి రైల్వే అండర్ బ్రిడ్జి వరకు నూతనంగా నిర్మించే సైడ్ డ్రైన్ నిర్మాణానికి స్థానిక నాయకులు, అధికారులతో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై అధికారులు, నాయకులతో సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గృహజ్యోతి కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.500లకు సబ్సిడీ గ్యాస్ సిలిండర్, ఇందిరమ్మ ఇళ్లు, అమృత్ 2.0 తదితర పథకాలపై చర్చించారు. అనంతరం పబ్లిక్ హెల్త్ ఈఈ ప్రభాకర్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడి అబివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు. ఈ సందర్భంగా పట్టణంలోని బస్టాండ్ పక్కన సైడ్ డ్రైన్ నిర్మించాలని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి స్థానిక ప్రజలు వినతిపత్రం అందజేశారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే త్వరలో డ్రైన్ నిర్మాణం చేయిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో స్థానికనాయకులు, మున్సిపల్ అధికారులు, మాజీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## జుంటుపల్లి రైతులకు న్యాయం చేయాలని కలెక్టర్‌కు ఫిర్యాదు

**వికారాబాద్, జూన్ 12, ప్రభాతవార్త:**

జుంటుపల్లి రైతులకు న్యాయం చేయాలని బిసి కమిషన్ మాజీసభ్యులు శుభప్రద్‌పటేల్ రైతులతో కలిసి కలెక్టర్‌కు ఫిర్యాదుచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, వరి కొన ుగోలుకేంద్రాల్లో అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆయన తప్పుపట్టారు. రైతుల పంటల ు అడ్డికి పావు శేరు లెక్కనే కొంటున్నారని మండిపడ్డారు. ఈవిషయమై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడం జరిగిందని తెలిపారు. రైతు ప్రభుత్వం అని గొప్పలు చెబుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రైతుల బాధలు కనిపించడం లేదా అన్నారు. కలెక్టర్ చెప్పినవిధంగా జంటుపల్లి రైతులకు వారంరోజుల్లో న్యాయం జరగకపోతే బిఆర్‌ఎస్ పార్టీ తరపున ధర్నాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జంటుపల్లి బాధితరైతులు బిఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# దుర్గంధ భరితం రైతుబజార్..

-ఊడ్చేవారు లేక పేరుకుపోయిన చెత్తచెదారం..
-చినుకు పడితే చాలు చిత్తడే..
-పిల్లర్ల దశలో నిలిచిపోయిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్..
-కనీస సౌకర్యాలు లేక అవస్థలు పడుతున్న రైతన్నలు..


వర్షం పడకుండా ఏర్పాటు చేసుకున్న తాడిపత్రీలు

**వికారాబాద్, జూన్ 12, ప్రభాతవార్త:**

రైతుబజార్‌కు వచ్చే కూరగాయల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దానికి తోడు రైతుబజార్లో తాజాకూరగాయలు కొందామని వచ్చే వినియోగదారులకు సైతం తిప్పలు తప్పడంలేదు. ఎటుచూసినా దుర్గంధం వెదజల్లుతుంది. చి నుకు పడితేచాలు రైతుబజార్ ఆవరణ మొత్తం చిత్తడిగా మారుతుంది. ఊడ్చేవారు లేక ఎక్కడ వేసిన చెత్త అక్కడే పేరుకుపోతుంది. పిల్లర్ల దశలోనే ఇంటిగ్రెటెడ్ మార్కెట్ నిర్మాణ ప నులు నిలిచిపోవడంతో కూరగాయలు విక్రయించేందుకు వచ్చిన రైతులకు తిప్పలు తప్పడంలేదు. వర్షాకాలం కావడంతో వర్షాలు కురవడంతో రైతుబజార్ మార్కెట్ ఆవరణ బురదమయంగామారుతుంది. రైతులుతెచ్చిన కూరగాయలుసైతం తడిసిపోవడంతో తక్కువ ధరకే కూరగాయలు విక్రయించాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు. సరైనసౌకర్యాలు లేకపోవడంతో వర్షంలోనే రైతులు కూర్చొని కూరగాయల ు విక్రయిస్తున్నారు. తాజా కూరగాయలు కొ నుగోలు చేద్దామని భావించి రైతుబజార్‌కు వచ్చిన వినియోగదారులకు దుర్గంధం వెదజల్లడంతో అపరిశుభ్రమైన కూరగాయలు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. రైతుబజారుకు వెళ్ళి రోగాలు కొనితెచ్చుకోవడం అవుతుందని వినియోగదారులు వాపోతున్నారు. పేరు పెద్ద..ఊరు దిబ్బ అన్న చందంగా వికారాబాద్‌లోని రైతు బజార్ దుస్థితి తయారైంది. పేరుకే వికారాబాద్ జిల్లాకేంద్రం. ఎటుచూసినా అరకొర సౌకర్యాలతో పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కనీసం నిత్యవసరాలైన కూరగాయలు కొ నుగోలు చేద్దామన్నా రైతుబజార్లో సౌకర్యాలేమి కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. బిఆర్‌ఎస్ ప్రభుత్వహయాంలో రైతుబజార్‌లో ఉన్న షెడ్లను కూల్చివేసి, కోట్లాది రూపాయలు వెచ్చించి ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణానికి శంఖుస్థాపన చేసి నిర్మాణాలు చేపట్టారు. తీరా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడడంతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ప నులు పిల్లర్ల దశలోనే నిలిచిపోయాయి. గత ప్రభుత్వం శంకుస్థాపన చేస్తే తామెందుకు నిర్మించాలనే ధోరణిలో ప్రస్తుత ప్రభుత్వ పాలకులు వ్యవహరిస్తున్నారు. సంబంధిత శాఖ అధికారులు సైతం పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

**-స్వీపర్ జీతంలోనే ఇరువురికి సర్దుబాటు..**

రైతు బజారులో చెత్త పేరుకుపోవడానికి కారణం సరిపడా స్వీపర్లు లేకపోవడమే. అవుట్ సోర్సింగ్ కింద రైతు బజారులో ఊడ్చేందుకు ఒక స్వీపర్ పోస్టును సంబంధితశాఖ అధికారులు కేటాయించారు. రూ.15,600 స్వీపర్‌కు నెలజీతం ఇవ్వాల్సి ఉండగా, జిల్లా మార్కెటింగ్ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌కు రూ.9000, రైతు బజారులో ఊడ్చే వారికి రూ.6,600 జీతం ఇచ్చి సర్దుబాటు చేస్తున్నారు. స్వీపర్ జీతాన్ని ఇద్దరికి సర్దుబాటుచేసి అధికారులు చేతులు దులుపుకొంటున్నారు. రైతుబజారులో పనిచేసే స్వీపర్‌కు తక్కువ జీతం ఉండటంతో ఉదయం వేళల్లో ఒకసారి చెత్త ఊడ్చేసి వెళ్తుంది. దీంతో పగలంతా పడిన చెత్తాచెదారం పేరుకుపోతుంది. వర్షంకురిస్తే వరదనీరు వచ్చి దుర్గంధం వెదజల్లుతుంది. వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, సరిపడా స్వీపర్లను నియమించి రైతుబజార్ ఆవరణ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

**-పాలకులకు పట్టని రైతుల గోస..**

నేరుగా రైతుబజార్‌లో కూరగాయలు విక్రయిస్తే నాలుగు రూపాయలు ఎక్కువ వస్తాయని భావించి కూరగాయలు పండించే రైతులు ప్రతినిత్యం రైతు బజార్‌కు రావడం జరుగుతుంది. రైతుబజార్‌లో కనీస సౌకర్యాలు లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కనీస సౌకర్యాలైన మంచినీరు, మరుగుదొడ్లు సరిపడా లేక మహిళా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇబ్బందులను తట్టుకోలేక వచ్చినకాడికి కూరగాయలను తక్కువధరలకే విక్రయించి నష్టపోతున్నారు. వర్షసూచన ఉంటే తడిసిపోతామని భావించి, అతి తక్కువ ధరకు కూరగాయలు విక్రయించాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు. ఇన్ని ఇబ్బందులు రైతులు ఎదుర్కొంటున్నా స్థానిక ప్రజాప్రతినిధులు ఏమీపట్టనట్లు వ్యవహరిస్తున్నారని రైతులు పేర్కొంటున్నారు. స్థానిక ఎమ్మెల్యే స్పందించి నిధులు మంజూరు చేసి నిలిచిపోయిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు పునఃప్రారంభించాలని పలువురు కోరుతున్నారు.

## మోడీ నాయకత్వంలో దేశంలో సుస్థిరపాలన

### -ఎంపి ఈటల రాజేందర్


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపి ఈటల రాజేందర్

**మేడ్చల్, జూన్ 12, ప్రభాతవార్త:**

దేశంలో 2014సంవత్సరానికి పూర్వం సంకీర్ణ రాజకీయాలు తప్ప సుస్థిరప్రభుత్వం కొనసాగే పరిస్థితిలేదని, దేశ ప్రధానిగా నరేంద్రమోడీ పగ్గాలు చేపట్టిన నాటినుండి కేంద్రంలో 11 సంవత్సరాలుగా బిజెపి ప్రభుత్వం కొనసాగుతున్నదని మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్ అన్నారు. మేడ్చల్ మండలపరిధిలోని పూడూర్ గ్రామ శివారులోని ఎంపి ఈటల రాజేందర్ తన నివాసంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 2913లో సంకీర్ణ రాజకీయాల ఎడబాటు, స్కాములు, మంత్రులు జైలుపాలై దేశప్రతిష్ఠ దిగజారిపోయి, ఆర్థికవ్యవస్థ అనుకున్నంతగా పెరగక, పేద ధనిక గ్యాప్ పెరుగుతున్నసమయంలో బిజెపి ఓసాహాసపేతమైన నిర్ణయం తీసుకుందని అన్నారు. ఆసమయంలో దేశాన్ని బాగుచేయాలంటే జాతీయప్రణాళిక వ్యూహంతో బిజెపి అధికారంలోకి వస్తేనే సాధ్యమవుతుందని భావించి నాడు గుజరాత్ ముఖ్యమంత్రిగా మోడీ నాయకత్వంలో ఎన్నికలకు వెళ్లిందని అన్నారు. దీంతో యావత్‌దేశం బిజెపి పార్టీకి, మిత్రపక్షాలకు 300పైగా సీట్లు ఇచ్చి దేశానికి భారత జాతి ఒక అజేయమైన ప్రభుత్వాన్ని ఇచ్చిందని తెలిపారు. 2014కు ముందు 11వ ఆర్థిక వ్యవస్థగా ఉన్న భారత్ ఇవాళ నాల్గవ ఆర్థికవ్యవస్థగా ఎగబాకిందని తెలిపారు. ఆపరేషన్ సింధూర్‌పేరుతో పాకిస్తాన్‌పై ప్రతీకారం తీసుకున్న సందర్భం మీకు తెలుసని, ఈ11ఏళ్ల మోడీ పరిపాలనలో అనేక రంగాలలో స్వంతంగా భారతదేశం ఎదుగుతుందని అన్నారు. భారతదేశం 2047వరకు వికసితభారత్‌గా పురోగమించడంలో ప్రజలు నిండుమనసుతో మోడీని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర బిజెపి ఉపాధ్యక్షుడు విజయరామారావు, బిజెపి రాష్ట్ర కార్యదర్శి ఆకుల విజయ, రాష్ట్రనాయకులు సుదర్శన్‌రెడ్డి, చిత్తరంజన్ రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు బుద్ధి శ్రీనివాస్, నియోజకవర్గ కన్వీనర్ మోహన్‌రెడ్డి, మేడ్చల్ మున్సిపల్ బిజెపి అధ్యక్షురాలు శైలజాహరినాథ్, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, జగన్‌గౌడ్, శోభారెడ్డి, చంద్రారెడ్డి, తిరుమల్‌రెడ్డి, విజయలక్ష్మి, వంశీ తదితరులు పాల్గొన్నారు.

## నాకు మంత్రి పదవి రావడానికి ఎమ్మెల్యే పాత్ర ఉంది

### -రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్

**చేవెళ్ల, జూన్ 12, ప్రభాతవార్త:**

నాకు మంత్రి పదవి రావడం వెనుక చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య పాత్ర కూడా ఉందని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ మైనార్టీ సంక్షేమ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ అన్నారు. గురువారం మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌ను మంత్రుల నివాసంలో కలిసి చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య శుభాకాంక్షలు తెలిపారు. మాదిగ సామాజికవర్గం కోటాలో తనకు మంత్రిపదవి వచ్చిందని, అందుకు మాదిగ శాసన సభ్యుల పాత్ర కీలకమని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ఎమ్మెల్యే కాలే యాదయ్యను ఆలింగనం చేసుకున్నారు. చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య వెంట చేవెళ్ల సీనియర్ నాయకుడు మర్పల్లి క్రిష్ణారెడ్డి కూడా ఉన్నారు.


మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌ను కలిసిన ఎమ్మెల్యే కాలే యాదయ్య

## రద్దు చేసిన రైళ్ళను పునరుద్ధరించాలి


చిట్టిగిడ్డ రైల్వేస్టేషన్

**నవాబుపేట, జూన్ 12, ప్రభాతవార్త:**

మండలప్రజలకు వరప్రదాయని రైలుసౌకర్యం. సురక్షితమైన ప్రయాణానికి తక్కువ రైలుచార్జీలతో సుదూరం ప్రయాణించడానికి దోహదం చేసే రైలు ప్రయాణంతో ముడిపడి ఉన్న మండలప్రజలకు గతంలో ఉన్నన్ని రైళ్ళను నిలపకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు ఆయా గ్రామాల వారు తెలిపారు. మండల పరిధిలో రెండు చిట్టిగిడ్డ, గుల్లగూడ రైల్వేస్టేషన్లు ఉన్నాయి. ఈ స్టేషన్ల ద్వారా పరిసర గ్రామాల వారు ఆయా ప్రాంతాలకు రైలు ప్రయాణం సాగించేవారు. అయితే కరోనా వ్యాధి సంభవిస్తున్న సమయంలో లాక్‌డౌన్ విధించడంతో రైళ్ళను రద్దుచేశారు. ఈ నేపథ్యంలో కొన్నాళ్ళు రైళ్ళప్రయాణం మిథ్యగానే మిగిలింది. కరోనా వ్యాధి తగ్గుముఖం పట్టాక రైళ్ళను పునరుద్ధరించారు. అయితే గతంలో ఉన్నన్ని రైళ్ళను మండలపరిధిలోని రైల్వేస్టేషన్లలో నింపడం లేదు. దీంతో అనేకమంది యువకులు ఉపాధిని కోల్పోతున్నారు. హైద్రాబాద్ నగరానికి దాదాపుగా 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న తరుణంలో నిరుద్యోగ యువత ప్రయివేట్ సంస్థల్లో ఉద్యోగాలు చేయడానికి ఈ రైలు ప్రయాణమే ప్రధానమైనది. తక్కువ చార్జీలతో ప్రయాణం చేయడానికి అనుకూలమైన ఈ సౌకర్యం ఉండటంతో నెలవారి పాసులు తీసుకుని ఉద్యోగాలు చేసుకుని ఉపాధి పొందేవారు. చిట్టిగిడ్డ, గుల్లగూడ రెండు రైల్వేస్టేషన్లలో దాదాపు నిత్యం 1000 మందికిపైగా రాకపోకలు సాగించేవారు. ప్రస్తుతం ఉదయం మూడు రైళ్ళు నగరానికి వెళ్ళడానికి, సాయంత్రం మూడు రైళ్ళు రావడానికి ఈ స్టేషన్లలో నిలుపుతున్నారు. దీంతో సమయం అనుకూలించక నిరుద్యోగులు ఉపాధికి దూరమయ్యారు. గతంలో ఈస్టేషన్లలో నిలిపిన రైళ్ళను పునరుద్ధరించాలని తద్వారా ఉపాధి పొందుతామని వారు రైల్వే ఉన్నతాధికారులను కోరుతున్నారు. ఎంఎంటిఎస్ రైళ్ళను వికారాబాద్ వరకు పొడిగిస్తారని కలలు కంటున్న తరుణంలో ఉన్న రైళ్ళను రద్దుచేడంతో ఇబ్బందికి గురవుతున్నట్లు ఆయా గ్రామాల వారు చెబుతున్నారు. ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌ను చిట్టిగిడ్డ రైల్వేస్టేషన్‌లో నిలపాలని ఈ నేపథ్యంలో మరింత సౌకర్యంగా ఉంటుందని పలువురు కోరుతున్నారు. ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ ఉద్యోగాలు చేసుకునే వారికి అనుకూలమైన సమయం ఉంటుందని వారు అన్నారు. ప్రస్తుతం హైద్రాబాద్ వైపు నడుపుతున్న రైళ్ళు ఔరంగాబాద్ నుండి ఉదయం 5 గంటలకు చిట్టిగిడ్డ చేరుకుంటుంది. మండలపరిధిలోని మరో స్టేషన్ గుల్లగూడ మీదుగా హైద్రాబాద్ చేరుతుంది. గుల్బర్గా ప్యాసింజరు, డెమో ప్యాసింజరు రైళ్ళు మండల పరిధిలోని స్టేషన్లలో నిలుపుతున్నారు. ఈ రైళ్ళ ద్వారా మండల ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. గతంలో ఆస్టేషన్లలో నిలిపిన అన్ని రైళ్ళను ఈ స్టేషన్లలో నిలపాలని కోరుతున్నారు.

## వృద్ధురాలిపై అత్యాచారం


సంఘటనస్థలంలో ఎసిపి కెవిపి రాజు, సిఐ నందీశ్వర్‌రెడ్డి, ఎస్సై మధు, క్లూస్‌టీం డాగ్స్

**యాచారం, జూన్ 12, ప్రభాతవార్త:**

సభ్యసమాజం తలవంచుకునేలా 90ఏళ్ల వృద్ధురాలపై గుర్తుతెలియని దుండగులు అత్యాచారంచేసిన సంఘటన యాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారంరాత్రి చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం యాచారం మండలపరిధిలోని మంతన్ గౌరెల్లిగ్రామానికి చెందిన 90 సంవత్సరాల వృద్ధురాలు బుధవారంరాత్రి ఇంట్లో నిద్రిస్తుండగా గుర్తుతెలియని దుండగులు అఘాయిత్యానికి పాల్పడుతుండగా తీవ్రంగా ప్రతిఘటించింది. దీంతో ఆమెపై తీవ్రంగా దాడిచేసి అత్యాచారానికి ఒడిగట్టి అక్కడ నుండి పరారైనట్లు తెలుస్తుంది. గురువారం ఉదయం చుట్టుపక్కల వారు గమనించి పోలీసులకు సమాచారం అందజేశారు. దీంతో ఇబ్రహీంపట్నం ఏసిపి కెవిపి రాజు, యాచారం సిఐ నందీశ్వర్‌రెడ్డి, ఎస్సై మధు, పోలీస్‌శాఖ డాగ్స్ స్క్వాడ్లతో సంఘటన స్థలానికి చేరుకొని, ఆనవాళ్లను సేకరించారు. సంఘటనకు సంబంధించిన సిసిపుటేజ్‌లను సేకరించినట్లు తెలిపారు. బాధితురాలికి ముగ్గురు కుమారులు. అందులో ఒకరు మృతిచెందగా, ఒకతను యుఎస్‌లో ఉంటున్నాడు. మరో కుమారుడు హైదరాబాదులో ఉంటున్నాడు. నిరుపేద కుటుంబం పింఛన్ డబ్బులతోనే దయనీయస్థితిలో 90 సంవత్సరాల వృద్ధురాలు జీవనం గడుపుతున్న సందర్భంలో ఇలాంటి సంఘటన జరగడం సభ్యసమాజం తలదించుకునేలా ఉందని గ్రామస్థులు తీవ్ర ఆవేదన వ్యక్తంచేశారు. పలు యువజనసంఘాలు, మహిళాసంఘాల వారు సంఘటనకు పాల్పడినవారిపై కఠినచర్యలు తీసుకోవాలని ఆందోళన వ్యక్తంచేశారు. నేరస్థులను త్వరలో పట్టుకుంటామని కఠినశిక్ష పడేలా కృషి చేస్తామని పోలీసులు స్థానికులకు హామీ ఇచ్చారు.

## అంతర్రాష్ట్ర బైక్ దొంగ అరెస్టు

### -వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి


అంతర్ రాష్ట్ర బైక్ దొంగను పట్టుకున్న తాండూరు పోలీసులు

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, జూన్ 12, ప్రభాతవార్త:**

జిల్లాలోని తాండూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో అంతర్రాష్ట్ర బైక్ దొంగ ను అరెస్టు చేయడం జరిగిందని జిల్లా ఎస్పీ కె.నారాయణరెడ్డి తెలిపారు. కేసుకు సంబం ధించిన వివరాలు ఎస్పీ వెల్లడించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు గురువారం ఉదయం 9గంటలకు ఎస్ఐ ఎండి.సాజిద్, క్రైమ్‌సిబ్బంది నమ్మదగిన సమా చారం మేరకు పట్టణంలోని విలియంమూన్ చౌరస్తా వద్ద వాహనాల తనిఖీ చేస్తున్నారు. హైదరాబాద్ రోడ్‌నుండి వస్తున్న ఓ వ్యక్తి బైక్‌ని ఆపి, సంబంధిత ధృవపత్రాలు చూపించమని నిలదీశారు. ఈక్రమంలో ఆవ్యక్తి బైక్‌ని వదిలి పారిపోతుండగా అతనిని వెంబడించి పట్టుకొని తాండూర్ పోలీసుస్టేషన్‌కి తీసుకొనివచ్చి విచారించారు. దీంతో అతను యాలాల్ మండలం కమలాపూర్ నగ్రామానికి చెందిన బోయిని శ్రీకాంత్ అని చెప్పారు. తను ఆటో డ్రైవర్‌గా పని చేస్తానని, హైదరాబాద్ నగరంలోని వివిధ ప్రాంతాలలో మొత్తం 15 మోటార్ సైకిళ్ళని దొంగతనం చేశానని, వాటిలో 10 మోటార్‌సైకిళ్ళని తాండూర్ మండలంలోని బిజ్వార్ గ్రామస్థులకు విక్రయించినట్లుగా తెలిపాడు. 4మోటార్ సైకిళ్ళని తర్వాత అమ్ముకోవడానికి తన ఇంటివద్ద దాచి వుంచానని, మిగిలిన 1మోటార్ సైకిల్ తా ను నడుపుతూ పట్టుబడినట్లు తెలిపాడు. గతంలో కూడా ఈనేరస్థుడు సుమారు 20 కేసులలో జైలుకు వెళ్ళిరావడం జరిగిందని, ఈనేరస్థుడిని అరెస్ట్‌చేసి రిమాండ్‌కి తరలించడం జరిగిందని ఎస్పీ వివరించారు. చాకచక్యంగా వ్యవహరించి నేరస్థుడిని పట్టుకొని అతనివద్ద నుండి 15 మోటార్‌సైకిళ్లను స్వాధీనం చేసుకొన్నట్లు తెలిపారు. వాటివిలువ రూ.7,50,000 ఉంటుందని పేర్కొన్నారు. ఈకేసు ఛేదించిన పట్టణ ఇన్స్పెక్టర్ జి.సంతోష్‌కుమార్, సబ్‌ఇన్స్పెక్టర్ మహమ్మద్ అబ్దుల్‌సజీద్, హెడ్ కానిస్టేబుళ్లు అంజాద్, శివకుమార్, కానిస్టేబుళ్లు సాయప్ప, షబీల్ అహ్మద్‌లను జిల్లా ఎస్పీ అభినందించారు.

## విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ



పాఠ్యపుస్తకాలుపంపిణీచేస్తున్నమాజీ కౌన్సిలర్ మమతజగన్‌మోహన్‌రెడ్డి

**ఘట్‌కేసర్ రూరల్, జూన్ 12, ప్రభాత వార్త:** ప్రభుత్వం అందజేస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థులు విద్యలో రాణించాలని మాజీ కౌన్సిలర్ బద్దం జగన్‌మమత రెడ్డి అన్నారు. పోచారం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలతో పాటు నోటు పుస్తకాలను మాజీ కౌన్సిలర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ఏ అవసరమొచ్చిన తాము అండగా ఉంటామని అన్నారు. విద్యార్థులు చక్కగా చదువుకుని విద్యలో ఉత్తములుగా రాణించాలని ఆకాంక్షించారు. మాజీ కౌన్సిలర్ సామల శ్రీలతరెడ్డి, బీఆర్ఎస్ నాయకులుబద్దంజగన్‌మోహన్‌రెడ్డి, పాఠశాలప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## నోట్‌బుక్స్, యూనిఫామ్ పంపిణీ



**మెయినాబాద్, జూన్ 12, ప్రభాతవార్త :** మెయినాబాద్ మండలంలోని తోల్కట్ట గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఉచితంగా నోట్‌బుక్స్, యూనిఫామ్‌ని పంపిణిచేసిన తోల్కట్ట మాజి సర్పంచ్ కనకమామిడి శ్రీనివాస్ ముదిరాజ్, గ్రామంలోని పాఠశాలలో ప్రతిఏడాదివిద్యార్దులకుస్వచ్ఛందంగాతన సోంత డబ్బులతో గ్రామంలోని ప్రభుత్వ బడిలో చదువుకోనే విద్యార్దులకు అండగా, తన వంతు బాధ్యతగా ఉచ్చింగానోట్‌పుస్తకాలను, విద్యార్దులకుస్కూల్ యూనిఫామ్‌ని అందజేస్తారు, ఈ సందర్బంగా మాజి సర్పంచ్ శ్రీనివాస్ మాట్లాడుతూవిద్యార్దులు బడిలోనే ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకోవాలని, జీవితంలోఎన్ని వడుదుడుకులు వచ్చినా లక్ష్యాన్ని మరవకుడదన్నారు, ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని, ఉన్నత చదువులు చదువుకోని ఎంతో అనుభవంతో ఉన్న ఉపాధ్యాయులతో ఉన్నతమైన శిఖరాలనుచేరాలని, చదువుచెప్పినగురువులకు, కన్నవారికి, చదువుకున్న బడికి, గ్రామానికి గోప్ప పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని విద్యార్దులకు తెలిపారు, స్కూల్ ప్రిన్సిపాల్ రాములు, స్కూల్ చైర్మెన్ నిర్మల, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గోన్నారు,

### అభ్యాసన సామర్థ్యాల సాధనకి ప్రాధాన్యత ఇవ్వాలి

**కోట్‌పల్లి, జూన్12, ప్రభాతవార్త;** అభ్యాసన సామర్థ్యాల సాధనకి ప్రాధాన్యత ఇవ్వాలని వికారాబాద్ జిల్లా విద్యాధికారి రేణుకాదేవి అన్నారు. గురువారంనాడు బంట్వారం మండల పరిధిలోని బోపున్నారం ప్రాథమిక పాఠశాలలో విద్యా సంవత్సరం ప్రారంభ వేడుకలో పాల్గొన్నారు. ఈసందర్భంగా అమె మాట్లాడుతూ. ప్రభుత్వ బడిలో విద్యార్థులను చేర్పించాలన్నారు. అదే విధంగా ప్రభుత్వం విద్యార్థులకు యూనిఫాం, నోట్‌బుక్స్, టెక్స్‌బుక్స్, ఉచితంగాఇవ్వడం జరుగుతుందన్నారు. విద్యార్థులు వారి తరగతికి సంబందించి విద్యా సామర్థ్యాలు సాధించనప్పుడే పూర్తిగా విజయవంతమైనట్లుగా భావించాలని అమె పేర్కొన్నారు మండలవిద్యాధికారివెంకటేశ్వర్‌రావు, జిఎచ్‌యం, విక్రమ్‌రెడ్డి, ఏయం ఓరామ్, రజనీ, ప్రధానోపాధ్యాయురాలు అంజమ్మ, గ్రామస్థులు పాల్గొన్నారు,

### 2సం.పిల్లలను అంగన్ వాడీలో చేర్చాలి

**కోట్‌వల్లి, జూన్12, ప్రభాతవార్త;** రెండున్నరసంవత్సరపిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలల్లో చేర్పించాలని ఐసీడీఎస్ సుపర్ వైజర్ ధనలక్ష్మి అన్నారు. గురువారం నాడు కోట్‌పల్లి మండల పరిధిలోని లింగంపల్లి గ్రామంలో అమ్మమాట. అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా ప్రీస్కూల్ పిల్లల తల్లులకు, గర్బిణీలకు అంగన్‌వాడీ కేంద్రంలో జరిగే కార్యక్రమాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్బంగా అమె మాట్లాడుతూ. పిల్లలకు ప్రీస్కూల్ సిలబస్ ప్రతిరోజు దినచర్య అన్నారు. కథలపుస్తకాలు, పీస్కూల్ మెటీరియల్ పిల్లలో జరిగే అభివృద్దిదశలగురించిఅంగన్‌వాడీలోఅందించే భోజనం బాలమృతంలో ఎన్నోపోషకాలుఉంటాయనిపిల్లలకుగర్భిణీలకుఅందివ్వడం జరుగుతుందన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రం అవరణలో కూరగాయాల మొక్కలు నాట్యారు. అంగన్‌వాడీ టీచార్ మౌనికపంచాయతీకార్యదర్శి హేమలత, ఆయా తల్లులు, పాల్గొన్నారు,

### ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య : తహశీల్దార్

**కోట్‌పల్లి, జూన్ 12, ప్రభాతవార్త;** ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందుతుందని తహశీల్దార్ శ్రీనివాస్ అన్నారు. గురువారం నాడు కోట్‌పల్లిమండల కేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల అవరణలో నూతన విద్యా సంవత్సరం ప్రారంభం సందర్బంగా విద్యార్థులకు ప్రభుత్వంఅందిస్తున్నఉచితపాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫాంలను విద్యార్థులకు అందజేశారు. ఈసందర్బంగా వారు మాట్లాడుతూ. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలను బలోపేతం చేసినాణ్యమైన విద్యా అందించెందుకు కృషి చేస్తుందన్నారు. విద్యార్థులు ప్రతి రోజు పాఠశాలలో ఉపాధ్యాయులు భోదించే పాఠ్యంశాలను శ్రద్దగా చదివి మంచిమార్కులుసాధించాలనివిద్యార్థులకుసూచించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అంజయ్య, కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకులు నక్కలబందయ్య, మండలవిద్యాధికారిచ్రంద్రప్ప, బిజెపిమండల అధ్యక్షులు శివకుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు,

### విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ

**శామీర్‌పేట్, జూన్12, ప్రభాతవార్త :** మేడ్చల్ జిల్లా మూడుచింతలపల్లి మండలం కేశవరం ప్రాథమిక పాఠశాలలో ఏఎంసీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింలు యాదవ్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణి చేశారు. కార్యక్రమ అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించడానికి తెలంగాణ ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుందని తెలిపారు. గత ప్రభుత్వంలో సగం విద్యాసంవత్సరం గడిచిన తర్వాత ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్‌లు సరఫరా చేసే వారని, ప్రస్తుతం సీఎం రేవంత్ రెడ్డి హయంలో రాష్ట్ర ప్రభుత్వం విద్యా సంవత్సరం మొదలు కాక ముందే విద్యార్థులకు యూనిఫామ్‌లు, పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్నామని అన్నారు. ప్రస్తుతప్రభుత్వంఅక్షరాస్యతనుపెంపొందించడానికి ఎంతగానో కృషిచేస్తుందని తెలిపారు. అదేవిదంగా విద్యార్థులకు నాణ్యమైన విద్యనుఅందించాలనిఉపాధ్యాయులకుసూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు హారిక, ఉపాధ్యాయులు మోనిక, శిరీష, హసీనా బేగం, కాంగ్రెస్ నాయకులు మహమ్మద్ యూసుఫ్, మాజీ వార్డ్‌మెంబర్‌బొమ్మలపల్లి వెంకటేష్, శంకర్ నాయక్ పాల్గొన్నారు.

### సిసి కెమేరాల ఏర్పాటుకు 10,000 విరాళం

**తలకొండపల్లి జూన్ 12 ,ప్రభాతవార్త,** తలకొండపల్లి మండల పరిధిలోని గట్టుప్పలపల్లి గ్రామానికి చెందిన ఏదుల మహేష్ అనే వ్యక్తి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు కోసం తన వంతుగా 10 వేల రూపాయల ఆర్థిక సాయం తలకొండపల్లి ఎస్సై శ్రీకాంత్ కు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై శ్రీకాంత్ మాట్లాడుతూ నేరాల పరిరక్షణకు సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడతాయని గ్రామ యువకులు ముందుకు వచ్చి సిసి కెమెరాలు ఏర్పాటుకు విరాళాలు అందజేయడం అభినందనీయమని ఆయన అన్నారు. అనంతరం ఏదుల మహేష్ నుంచి పదివేల రూపాయల చెక్కును అందుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, బి ఆర్ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు రేణు రెడ్డి, మండల కృష్ణయ్య సిపిఎం గ్రామ కమిటీ కార్యదర్శి మండల కృష్ణయ్య సిపిఎం గ్రామ కమిటీ కార్యదర్శి కొమ్ము చెన్నయ్య ,శేఖర్ తదితరులు ఉన్నారు.

# పేద విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను అందిస్తాం

## చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య వెల్లడి

**చేవెళ్ల, జూన్ 12, ప్రభాతవార్త:** పేదవిద్యార్దులకుపాఠశాల మొదటి రోజునే పాఠ్యపుస్తకాలను అందిస్తున్నామని చేవెళ్ల ఏమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. గురువారం చేవెళ్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్దులకు ప్రభుత్వం అందజేస్తున్న పాఠ్యపుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా చేవెళ్ల ఏమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపాఠశాలలుప్రారంభంరోజునే పాఠ్యపుస్తకాలను అందజేస్తుందన్నారు. పేద విద్యార్దుల చదువులకు ప్రభుత్వం ఎన్ని నిధులైన మంజూరు చేస్తుందన్నారు.

పాఠ్యపుస్తకాలతో పాటు నోటు పుస్తకాలను కూడ అందజేస్తున్నామన్నారు. పేద విద్యార్దులకు ప్రభుత్వ అన్ని విదాలుగా అండగా ఉంటుందన్నారు. పాఠశాలలో ఎదైన సమస్యలుంటే తమ దృష్టికి తీసుకోవాలన్నారు. చేవెళ్ల సహకార సంఘం చైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి, చేవెళ్ల నియోజకవర్గ సీనియర్ నాయకుడు సున్నపు వసంతం, చేవెళ్ల సీనియర్ నాయకులు మర్పల్లి క్రిష్ణారెడ్డి, మండల పార్టీ అద్యక్షుడు వీరేందర్‌రెడ్డి, చేవెళ్ల మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటిడైరెక్టర్‌లు పాండు, జెఎల్‌ఆర్ లు పాల్గోన్నారు.



చేవెళ్ల జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల విద్యార్దులకు పాఠ్యపుస్తకాలను అందజేస్తున్న చేవెళ్ల ఏమ్మెల్యే కాలే యాదయ్య

# అణగారిన వర్గాలకు మంద కృష్ణమాదిగ నాయకత్వం అవసరం

## ఎమ్మార్పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగళ్ల ఉపేందర్ మాదిగ

**చేవెళ్ల, జూన్ 12, ప్రభాతవార్త:** అణగారిన వర్గాలు అభివృద్ది చేందాలంటే మంద క్రిష్ణా మాదిగ నాయకత్వం అవసరమని ఏమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగళ్ల ఉపేందర్ మాదిగ అన్నారు. గురువారం చేవెళ్ల మండల కేంద్రంలో ఏమ్మార్పిఎస్, అనుబంధ విభాగాల ముఖ్య నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగళ్ల ఉపేందర్ మాదిగ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా పీడిత వర్గాలను ఎకం చేయాలంటే మంద క్రిష్ణామాదిక నాయకత్వం మాత్రమే కావాలన్నారు. సమూజంలోని అసమానతలు లేని నూతన సమాజ నిర్మాణమే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. జూలై 7న మాదిగల అత్మగౌరవ ప్రతికైన ఏమ్మార్పిఎస్ జెండా ప్రతి గ్రామంలో ఎగరాలని, విద్యా, ఉద్యోగాల్లో వర్గీకరణ ఫలాలు అందుకునే విధంగా మాధిగ విద్యార్దులు చదువుకోవాలన్నారు. సామాజీక ఉద్యమాల సారధి, ప్రజా ఉద్యమాల వారధి ఉద్యమాలతో పాలకుల మెడలు వంచి ప్రజలకు అనేక సంక్షేమ పథకాలను అందించిన ఉద్యమ నాయకులు మంద క్రిష్ణామాదిగ అన్నారు. సమస్యల పరిష్కారం కోసం పీడిత వర్గాలను ఏకం చేసి దేశ వ్యాప్తంగా ఉద్యమాన్ని నిర్మిస్తున్నామన్నారు. జూలై 7న ఏమ్మార్పిఎస్ 31వ అవిర్బావ దినోత్సవం సందర్భంగా ప్రతి గ్రామంలో ఏమ్మార్పిఎస్ జెండాను ఎగురవేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బాద్యత శివశంకర్ మాదిగ, జిల్లా ఇంచార్జి యాదగిరి మాదిగ, ఎంఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చెడుపల్లి రఘువరన్ మాదిగ, ఏమ్మార్పిఎస్ జిల్లా అధ్యక్షుడు పెంటన్నోళ్ల నరసింహ మాదిగ, ఏమ్మార్పిఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కాడిగళ్ల ప్రవిణ్‌కుమార్ మాదిగ, జిల్లా అద్యక్షుడు నాని భావుప్రసాద్ మాదగ, మండలాల నాయకులు శ్రీనివాస్ మాదిగ, మల్లికార్జున మాదిగ, విజయ్ మాదిగ, అమృత రాజ్ మాదిగ తదతరుల పాల్గోన్నారు.

### జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలల పునఃప్రారంభ వేడుక



**కొత్తూరు, ప్రభాతవార్త, జూన్12:** కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని జడ్పీహెచ్‌ఎస్ పాఠశాల పునఃప్రారంభ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉచిత యూనిఫారాలు, పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తహసీల్దార్ రవీందర్ రెడ్డి హాజరై విద్యార్థులకు ఉచిత యూనిఫారాలు, పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థులకు సమానంగా విద్య అవకాశాలు పొందాలనే లక్ష్యంతో ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని, అందుబాటులో ఉన్న వనరులను విద్యార్థులు పూర్తిస్థాయిలో వినియోగించుకొని తమ భవిష్యత్తును మెరుగుపర్చుకోవాలని సూచించారు. విద్యార్థులమౌలికఅవరాలనుతీర్చడంలో ఇలాంటి కార్యక్రమాలు ప్రోత్సాహకరంగాఉంటాయనిఅన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

### ఉచితసేవలు.. అభినందనీయం

**నందిగామజూన్12ప్రభాతవార్త :** నందిగామమండలం మామిడిపల్లి గ్రామంలో గురువారం విజయ కార్డియాక్ మరియు మెటర్నిటీ హాస్పిటల్ నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ సీనియర్ నేత జినుగుంట్ల నవీన్ గౌడ్ హాజరై విజయ కార్డ యాక్ మరియు మెటర్నరీ హాస్పిటల్ గుండె వైద్య నిపుణులు డాక్టర్ చందులాల్ రాథోడ్ నిర్వహిస్తున్న వైద్య సేవలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో బాల్ రెడ్డి, వెంకట్ రెడ్డి, కటిక పోగుల శ్రీనివాస్, నరేందర్ రెడ్డి, సతీష్, రాజలింగం, చీకుర్తిసుదర్శన్, శేఖర్‌రెడ్డి, నరసింహారెడ్డి, ఇమ్రాన్ పాల్గొన్నారు.

### మాజీ ఎంపిటిసిని పరామర్శించిన ఎమ్మెల్యే శంకర్



**షాద్‌నగర్, ప్రభాతవార్త, జూన్12 :** ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని గంట్లవెల్లి మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బాదేపల్లి సిద్దార్థ తల్లి నర్సమ్మ అనారోగ్యంతో మృతిచెందిన విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సిద్దార్థ ఇంటికి చేరుకొని నర్సమ్మ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, కాంగ్రెస్ నాయకులు చెంది తిరుపతిరెడ్డి, బాలరాజు గౌడ్, చల్లా శ్రీకాంత్ రెడ్డి, అగ్గనూరు బస్వం, ఇబ్రహీం, కొమ్ము కృష్ణ, జాంగారి రవి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు మల్లేష్, కరుణాకర్, నాయకులు పులిమామిడి శ్రీశైలం గౌడ్, విజయ్‌కుమార్ రెడ్డి, రాజు నాయక్, తుపాకుల శేఖర్, కావలి కృష్ణ, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పులిమామిడి రాజేష్ గౌడ్, కమ్మదనం నవీన్, చిల్కమర్రి రవీందర్ రెడ్డి, లింగారం యాదయ్య, టెలిఫోన్ వెంకటయ్య, జనార్ధన్, అర్జునప్ప, గొర్ల రాము, కృష్ణారెడ్డి, ఉన్నారు.

### స్మశాన ప్రహరీగోడను నిర్మించాలి

**షాద్‌నగర్, ప్రభాతవార్త, జూన్12 :** షాద్‌నగర్ పట్టణంలో ఇటీవల కురిసిన వర్షాలకు కూలిపోయిన స్టేడియం వద్ద ఉన్న హిందూ స్మశాన వాటిక ప్రహరీగోడను పునర్నిర్మించాలని కోరుతూ పలు ఆర్యవైశ్య, బ్రాహ్మణ సమాఖ్య, రెడ్డి సంఘం, పద్మశాలి సంఘం, మార్వాడి సంఘం నాయకులుస్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు వినతిపత్రం అందజేశారు.

### బిసి మహిళలు సామాజికంగా ఎదగాలి

**కొందుర్గు, ప్రభాతవార్త, జూన్12:** వెనకబడినవర్గాలకు చెందిన మహిళలందరు చైతన్యవంతులై మహిళలందరు రాజకీయంగా, సామాజికంగా ఎదగాలని బీసీసేన మండల విభాగం అధ్యక్షురాలు ఈరాపురం అనిత శేఖర్‌గౌడ్ పిలుపునిచ్చారు. గురువారం మండల పరిధిలోని పర్వతాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన బీసీ సంఘం సమావేశానికి ముఖ్య అతిథిగా ఆమె హాజరై మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు గడిచినా ఇంకా మహిళలు వెనకబడి ఉన్నారని, ఇకనైనా మహిళలందరు ఏకతాటి పైకి వచ్చి అన్ని రంగాల్లో రాణించాలని పిలుపునిచ్చారు .గ్రామమహిళాకమిటీ అధ్యక్షురాలిగాబుడోళ్ల లతా గౌడ్, ఉపాధ్యక్షురాలిగాఈశ్వరమ్మ కురుమ, ప్రధానకార్యదర్శిగా రమణి, కార్యదర్శిగా డబ్బా కిష్టమ్మ కురుమ, కోశాధికారిగా కాశమంగమ్మలను ఎన్నుకన్నట్లు ఆమె తెలిపారు .అసెంబ్లీబీసీసేనమహిళాఅధ్యక్షురాలుబాస వరలక్ష్మి, ఫరూఖ్‌నగర్‌మండలఅధ్యక్షుడుమేకల వెంకటేష్, పాల్గొన్నారు.

### అద్భుతాలు సృష్టించారు

**నందిగామ, జూన్ 12 ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు అద్భుతాలు సృష్టించారని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి, చేగూరు కాంగ్రెస్ సీనియర్ నేత మంకాల శ్రీశైలం అన్నారు. నందిగామ మండలం చేగూరు హైస్కూల్లో చదివి అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన పదవ తరగతి విద్యార్థులకు నగదు నజరానా అందించి శాలువాలతో సన్మానించి అభినందించారు. హెచ్‌ఎంరాజు రెడ్డి, పేరెంట్స్ కమిటీ అధ్యక్షురాలు చంద్రకళ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ చేగూరు పదవ తరగతి లో మీరు సాధించిన ఫలితాలు కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ఉన్నాయని ఆయన కితాబిచ్చారు. భవిష్యత్తులో ఉన్నత చదువులు చదివి ఉన్నతలుగా ఎదగాలన్నారు. అనంతరం మొదటి బహుమతి పల్లవికి రూ .10వేలు, ఇందు ద్వితీయ బహుమతి రూ.7.500వేలు, తృతీయ బహుమతి మీనాక్షి రూ.5000వేలు అందజేశారు. ఆవుల శివ, గునుగుర్తి రాజశేఖర్, ప్రాథమిక పాఠశాల విద్యా కమిటీ అధ్యక్షురాలు మంగలి భాగ్య, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థులు, పాల్గొన్నారు.

### పచ్చదనంతోనే స్వచ్ఛమైన ఆక్సిజన్ : శివ సాయి దత్తు

**శంషాబాద్, జూన్ 12. ప్రభాతవార్త :** పచ్చదనాన్ని పెంపొందిస్తేనే ప్రజలందరికీస్వచ్ఛమైన ప్రాణవాయువు లభిస్తుందని ధర్మగిరి దేవాలయ వ్యవస్థాపక సభ్యుడు శివ సాయి దత్తు. సూచించారు. శంషాబాద్ లోని ధర్మగిరి సాయిబాబా ఆలయం వద్ద గురువారం పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అన్నదాన కార్యక్రమం అనంతరం ఇక్కడికి వచ్చిన భక్తులకు మొక్కలను పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ తమ తమ నివాస గృహాల వద్ద ఇంటి చుట్టుపక్కల రోడ్ల పక్కన ఎక్కడ అనుకూలంగా ఉంటే అక్కడ మొక్కలను నాటాలని సూచించారు. నాటిన ప్రతి మొక్కను కంటికి రెప్పలా కాపాడుకోవాలని శివసాయి దత్తు వారికి విజ్ఞప్తి చేశారు. ప్రతి ఒక్కరు తమ వంతుగా రెండు మూడు మొక్కలను నాటి వాటిని కాపాడుకుంటే మన భావి తరాల వారికి మనం ఇచ్చే గొప్ప ఆస్తి అని సూచించారు. భవిష్యత్తులో మన పిల్లాపాపలకు మంచి ఆక్సిజన్ లభించాలంటే విధిగా మొక్కలను నాటి పెంచాలని సూచించారు. మనం నాటి వాటిని సంరక్షించడం వల్ల పెరిగే ప్రతి మొక్క వందలాది మందికి ప్రాణవాయువును ప్రసాదిస్తుందని శివ సాయి దత్తు అన్నారు. అన్నదానంతో పాటు ప్రాణ వాయు ధానం కూడా చాలా గొప్పదని ఆయన స్పష్టం చేశారు. దాదాపు 5 మొక్కలను భక్తులకు పంపిణీ చేశారు.

# ఆటలపోటీలో గెలుపు ఓటములు సహజం నిరాశ చెందకూడదు

## ఎమ్మెల్యే కొప్పుల మహేష్‌రెడ్డి




**పూడూరు, జూన్ 12, ప్రభాతవార్త :** .ఆటల పోటీలలో గెలుపు, ఓటమిలు సహజం. ఓడినవారు నిరాశకు గురికాకూడదని, నేటి ఓటమి రేపటి గెలుపుకు నాందిగా భావించాలని పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్‌రెడ్డి పేర్కొన్నారు. గత 20రోజులుగా పూడూరు మండలం పరిధిలోని మన్నెగూడ ఎంసిబి గ్రౌండ్‌లో బిఆర్ఎస్ మండలపార్టీ ఉపాధ్యక్షుడు రాయిస్ అహ్మద్‌ఖాన్ అద్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో గురువారం విజేతలుగా నిలిచి ప్రథమస్థానం పొందిన మీర్జాపూర్ జట్టుకు కప్పుతోపాటు రూ.50వేలు, ద్వితీయ స్థానం పొందిన మన్నెగూడ జట్టుకు రూ.25వేల నగదుతోపాటు కప్పును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చదువుతోపాటు ఆటల్లో రాణించాలని ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంతాలనుండే యువత మట్టిలో మాణిక్యాల్లా ఆటల్లో రాణించి దేశానికి ప్రాతినిధ్యం వహించిన క్రీడాకారులు ఎందరో ఉన్నారని గుర్తుచేశారు. ఆటల్లో చురుకుగా పాల్గొనేవారికి శారీరక దారూఢ్యంతోపాటుమానసికోల్లాంగాఉండే అవకాశం ఉందని వివరించారు. మండలంలోని యువతకు క్రీడా పోటీలు నిర్వహించేందుకుఆర్థికసహాయం అందిస్తున్న రాయిస్‌ఖాన్‌ను కొనియాడారు. అనంతరం గెలుపొందిన రన్నర్, విన్నర్ జట్లకు దయానంద్‌గౌడ్, జాహెద్‌లు 5వేల చొప్పున నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి మల్లేశం, మాజీ సర్పంచులు యు. బుచ్చన్న యాదవ్, సాయిలు, మండల బిఆర్ఎస్‌పార్టీ నాయకులు దేవనోనిగూడెం వెంకటయ్య, రయీస్‌అహ్మద్‌ఖాన్, ఆదిల్, మాణిక్యంగౌడ్, ప్రవీణ్, రాజు, వివిధ గ్రామాల ప్రజా ప్రతినిధులు, మండల యువజన సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## టిబివ్యాధిని గుర్తిస్తే నివారించుకోవచ్చు




**ధారూరు, జూన్ 12, ప్రభాతవార్త :** సరైన సమయంలో టీబీ వ్యాధిని గుర్తిస్తే నివారించుకోవచ్చని ధారూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ శాంతి అన్నారు. గురువారం మండల పరిధిలోని నాగారం గ్రామంలో గ్రామ పంచాయతీ వద్ద మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, టీబీ అనేది బ్యాక్టీరియా ద్వారా వచ్చే ఒక అంటువ్యాధి, ప్రధానంగా ఊపిరితిత్తుల ప్రభావితం చేస్తుందన్నారు. ఈ వ్యాధిని గాలి ద్వారా వ్యాప్తి చెందే అవకాశం ఉంటుందని చెప్పారు. గ్రామంలో ఆడ, మగవారికి ప్రత్యేక పరీక్షలు చేశారు. నాగారం సబ్ సెంటర్ డాక్టర్ అజ్రా, పంచాయతీ కార్యదర్శి కృష్ణ, పిహెచ్సి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అడుగుల్లో ఆనందం... అభినయంలో ఆరోగ్యం




**షాద్‌నగర్‌రూరల్, జూన్12, ప్రభాతవార్త:** అడుగుల్లో ఆనందం... అభినయంలో ఆరోగ్యం చిన్నారులు డ్యాన్స్ చేయడంలో అనేది కేవలం ఒక వినోదం మాత్రమే కాదు, అది వారి శారీరక, మానసిక, సామాజిక వికాసానికి తోడ్పడే ఒక అద్భుతమైన మార్గం... ప్రతికదలికలోఆనందాన్ని ప్రతి అడుగులో ఉత్సాహాన్ని నింపుకుంటూచిన్నారులు చేసిన నృత్య ప్రదర్శనలు ఎందరినో ఆకట్టుకున్నాయి. రాక్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరంలో మెలకువలు నేర్చుక్కు చిన్నారులతో శిక్షణ ముగింపు కార్యక్రమఆనినన నిర్వహించారు. షాద్‌నగర్ పట్టణంలోని సరస్వతి శిశుమందిర్ పక్కన ఉననన యోగ కేంద్రంలో రాక్ డ్యాన్స్ అకాడమీ నిర్వహకులు డాన్స్ మాస్టర్ అన్వర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా శ్రీదేవి డ్రామా కంపెనీ కార్యక్రమం కొరియోగ్రాఫర్ ఆశోక్ మాస్టర్, వీఎస్ డ్యాన్స్ స్టూడియో శివం మాస్టర్ తదితరులు హాజరై నటరాజ విగ్రహానికి దీప ప్రజ్వలన చేశారు. ఈచిన్నారులు తమనృత్యప్రదర్శనతో చూపరులను ఆకట్టుకున్నారు. ప్రత్యేకంగా పుష్పసాంగ్‌తో చేసిన డ్యాన్స్ అందర్నీ అలరించింది. అదేవిధంగా జబర్దస్త్ నటుడుషేర్‌ఖాన్, డ్రామా జూనియర్స్ కంటెస్టెంట్స్ అన్విక, ప్రణీత్, సుహానాలు తమ కామెడీ స్కిట్లతో కార్యక్రమాన్ని అద్యాంతం రక్తి కట్టించారు. అనంతరంశిక్షణపొందినచిన్నారులకుమెడల్స్ , సర్టిఫి కెట్లనుఅందజేశారు. చిన్నారుల తల్లిదండ్రులు, చిన్నారులు, నిర్వహకసిబ్బంది పాల్గొన్నారు.

### రెవెన్యూ సదస్సులతో సమస్యలు పరిష్కారం

**ఘట్‌కేసర్‌రూరల్, జూన్12, ప్రభాతవార్త:** భూ యాజమానులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు ఎంతో ఉపయోగపడుతాయని రెవెన్యూఅధికారులుఅన్నారు. పోచారం మున్సిపల్ పరిధిలోని యంనంపేట్‌లో గురువారం భూ భారతి రెవెన్యూ సదస్సు జరిగింది. రెవెన్యూ సదస్సులో ఇరవైకి పైగా ఫిర్యాదులు అందినట్లు అధికారులు వెల్లడించారు. గురువారం నాటితో ఘట్‌కేసర్ మండలంలోని ఆయా గ్రామాల్లో భూ భారతి రెవెన్యూ సదస్సులు ముగిసినట్లు అధికారులు వెల్లడించారు. డీటీ రాజేందర్, ఆర్ఐ సాయిరాం, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

### విద్యుత్ షాక్‌తో పశువులు మృతి

**జిల్లేడుచౌదరి గూడెం, జూన్ 12, ప్రభాతవార్త:** విద్యుత్ షాక్ తగిలి పశువులు మృతిచెందిన సంఘటన జిల్లెడు చౌదరిగూడ మండలంలోని జిల్లెడు గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికుల, బాదితుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన మిదిగడ్డ రాఘవకు చెందిన బర్రె, చించెటి సాయిలుకు చెందిన రెండు బర్రెలు, చించెటి ప్రభాకర్‌కు చెందిన ఆవు విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. పంట పొలాలలోని బోరు బావుల కోసం వేసిన విద్యుత్ వైరు తెగిపడడం వల్లన పశువులు గడ్డి మేసుకుంటు వెళ్లి ప్రమాదానికి గురైనట్లు బాదితులు తెలిపారు. ఒకే గ్రామానికి చెందిన నాలుగు పశువులు మృతి చెందడంతో గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. విద్యుత్ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ లోపం వల్లనే ప్రమాదాలు జరుగుతున్నాయని మండల వాసులు అంటున్నారు. సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి పశువులను కోల్పోయిన రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

### నాణ్యమైన విద్యను అందిస్తే గుర్తింపు వస్తుంది

**జిల్లేడుచౌదరి గూడెం, జూన్12, ప్రభాతవార్త:** విద్యార్థులకు ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యను అందిస్తే మంచి గుర్తింపు వస్తుందని ఎంపిడిఓ ప్రవీణ్‌కుమార్ అన్నారు. గురువారం జిల్లెడు చౌదరిగూడ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నూతనంగ 35మంది విద్యార్థులు చేరారు. ఈ సందర్బంగా ఎంపిడిఓ పాఠశాల ఉపాధ్యాయులను అభినందించారు. తమ పాఠశాలలో కొత్త విద్యార్థులను చేర్పించుకోవాలను తపన ఉండడం చాల సంతోషకరమన విషయమన్నారు. విద్యార్థులకు తాము ఉన్నామనే దైర్యాన్ని ఇచ్చి మంచి విద్యాను అందించాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యా అందుందని తెలిస్తే ప్రతి ఒక్కరు ఇక్కెడే తమ పిల్లలను చేర్పించే అవకాశం ఉంటుందని అన్నారు. అనంతరం విద్యార్థులకు ఏకరూప దుస్తులు, పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సునీత, శంకర్, తదితరులు ఉన్నారు.

### ఈ నెల 30 వరకు రేషన్ బియ్యం పంపిణీ

**శామీర్‌పేట్, జూన్ 12, ప్రభాతవార్త :** ప్రభుత్వ ఆదేశాల మేరకు మూడు నెలల రేషన్ సన్న బియ్యం పంపిణీ ఈనెల 30 వరకు కొనసాగుతుందని పౌరసరఫరాల జిల్లా మేనేజర్ సుగుణ బాయి తెలిపారు. ఉప్పల్‌లోని రేషన్ దుకాణాన్ని సందర్శించి పరిశీలించిన అనంతరం ఆమె మాట్లాడుతూ ఆహార భద్రత కార్డు కలిగి ఉన్న ప్రతి ఒక్కరికి ఈనెల 30 లోపు వారికి కోటాలను పంపిణీ చేయడం జరుగుతుందని, 3 నెలల స్టాక్ అందుబాటులో ఉంటుందని, ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో చౌక ధరల దుకాణాలు తెరిచి ఉంటాయని వివరించారు. మేడ్చల్ మల్కాజిరి జిల్లా పరిధిలో ఉన్న రేషన్ కార్డుదారులకు దాదాపు 68 శాతం కార్డుదారులకు మూడు నెలల రేషన్ సరుకులను పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. ప్రతి కార్డుదారుడికి రేషన్ సరుకులు అందేలా అన్ని విధాలా చర్యలు తీసుకుంటున్నామని, ఎవరు గాబరా పడాల్సిన అవసరం లేదన్నారు. రేషన్ బియ్యం సక్రమంగా జరిగేలా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని, కార్డు దారులు రేషన్ బియ్యాన్ని ఎవరికైనా విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. బియ్యం విక్రయించిన వారు పట్టుబడితే కార్డును రద్దు చేయడంతో పాటు వారిపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు. నూతన సాఫ్ట్‌వేర్‌లో అనేక మార్పులు తీసుకురావడం వల్ల ప్రస్తుతం సరుకుల పంపిణీ వేగంగా జరుగుతోందని పేర్కొన్నారు.

### ఈర్లపల్లి త్రిపుర రిసార్ట్స్‌ను సీజ్ చేయాలి

**చేవెళ్ల, జూన్ 12, ప్రభాతవార్త** అనుమతి లేకుండా కొనసాగుతున్న ఈర్లపల్లి త్రిపుర రిసార్ట్స్‌ను సీజ్ చేయాలని సిఐటియు చేవెళ్ల డివిజన్ అల్లి దేవెందర్ డిమాండ్ చేశారు. గురువారం చేవెళ్ల ఆర్డిఓ చంద్రకళకు అనుమతి లేకుండా నడుస్తున్న త్రిపుర రిసార్ట్స్‌ను సీజ్ చేయాని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్బంగా సిఐటియు చేవెళ్ల డివిజన్ అల్లి దేవెందర్ మాట్లాడుతూ చేవెళ్ల మండల ఈర్లపల్లి రెవెన్యూ పరిధిలోని అనుమతులు లేకుండా నడిపిస్తున్న త్రిపుర రిసార్ట్స్‌లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారన్నారు. త్రిపుర రిసార్ట్స్ యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈర్లపల్లి 111 జీఓ పరిధిలోకి వస్తుందని అక్కడ ఏలాంటి కట్టడాలు కట్టడానికి అనుమతులు లేవన్నారు. అనుమతిలేకుండా నడుస్తున్న త్రిపుర రిసార్ట్స్ పై అధికారులు ఎందుకు చర్యలు తీసుకోలేదన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం డివిజన్ సభ్యుడు ఎర్రవల్లి శ్రీనివాస్, కెవిపిఎస్ నాయకులు ఉప్పరి చంద్రశేఖర్, ఎస్ఎఫ్ఐ చేవెళ్ల మండల కార్యదర్శి చందు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే ప్రభుత్వ లక్ష్యం

-ఎంపిడివో గ్యామా, ఎంఈఓ వెంకట్



విద్యార్థినులతో ఎంపిడిఓ గ్యామా, ఎంఈఓ వెంకట్

**దోమ, జూన్ 12, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయుటకు ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని దోమ మండలపరిషత్ అభివృద్ధి అధికారి గ్యామా, మండల విద్యాధికారి వెంకట్ తెలిపారు. గురువారం దోమ మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థినులకు పాఠ్య పుస్తకాలను పంపిణీచేశారు. ఈసందర్భముగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు ప్రభుత్వపాఠశాలలో ఎన్నో సదుపాయాలను కల్పి స్తుందని అన్నారు. తల్లితండ్రులు తమ విద్యార్థులను క్రమం తప్పకుండా ప్రభుత్వ పాఠశాలకు పంపించేందుకు శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమములో ఎపిఎం సురేశ్, సిసి జంగయ్య, ఉపాధ్యాయులు రమాదేవి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## రైతుభరోసాకు దరఖాస్తు చేసుకోవాలి

-వ్యవసాయ అధికారి

**దోమ, జూన్ 12, ప్రభాతవార్త:** కొత్తగా భూమి పాసుపుస్తకాలు వచ్చిన రైతులు రైతుభరోసాకు దరఖాస్తు చేసుకోవాలని దోమమండల వ్యవసాయ అధికారి ప్రభాకర్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వానాకాలం 2025 సంవత్స రమునకు కొత్తగా పట్టాలు అయిన రైతులు 05.06.2025 నుండి 20.06.2025 వరకు దరఖాస్తుచేసుకోవచ్చని అన్నారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం రైతులు రైతుభరోసా దరఖాస్తు ఫారం, పట్టాదారు పాసుపుస్తకం జిరాక్స్, ఆధార్‌కార్డు జిరాక్స్, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్, ఆయాగ్రామాలలో ఉన్న వ్యవసాయ విస్తరణ అధికారులకు గడువులోగా అందించాలని తెలి పారు. గతంలో రైతుభరోసా డబ్బులు వస్తున్న రైతులు కొత్తగా ఎటువంటి జిరాక్స్‌లు ఇవ్వరాదని అన్నారు.

## రైతులకు రాయితీపై విత్తనాలు అందించాలి



ఎవో జ్యోతికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

**నవాబుపేట, జూన్ 12, ప్రభాతవార్త:** ప్రభుత్వం ద్వారా రైతులకు ఖరీఫ్ విత్తనాలు, వ్యవసాయ పరికరాలు రాయితీపై అందజేయాలని బిఆర్ఎస్ రైతు సంఘం మండల అధ్యక్షుడు జగన్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం ఎవో జ్యోతికి వినతిపత్రాన్ని అంద జేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు విధిగా రైతుభరోసా అందించాలని అన్నారు. ఖరీఫ్ విత్తనాలు విత్తడానికి రైతులు సన్నద్ధమైనా నేపథ్యంలో రైతుభరోసా డబ్బులు రైతుఖాతాల్లో జమచేయా లని ఆయన కోరారు. రాయితీ విత్తనాలు వెంటనే అందించాలని అన్నారు. అదేవిధంగా నకిలీవిత్తనాలను అరికట్టాలని ఆయన కోరారు. ఈ కార్య క్రమంలో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ గణపురం శాంతికుమార్, రైతు సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

### హత్యాచారం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలి: సిపిఎం

**యాచారం, జూన్ 12, ప్రభాతవార్త:** యాచారం మండల పరిధిలోని మంతన్ గౌరెల్లి గ్రామంలో 90 ఏళ్ల వృద్ధురాలిపై అత్యాచారంచేసిన దుండగులను వెంటనే అరెస్టుచేసి కఠినంగా శిక్షించాలని సిపిఎంపార్టీ సభ్యులు డిమాండ్‌చేశారు. ఈ సందర్భంగా సిపిఎంపార్టీ మండల కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.చందునాయక్ మాట్లా డుతూ.. 90 ఏళ్ల వృద్ధురాలిపై అత్యాచారం చేసిన ఘటన సభ్య సమాజం తలదించుకునేలా ఉందని అన్నారు. ఇలాంటి ఘటన మళ్లీ జరగకుండా ప్రభుత్వం భద్రత కల్పించాలన్నారు. వెంటనే వృద్ధురాలికి న్యాయం చేయా లని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో సిపిఎంపార్టీ మండలకమిటీ సభ్యులు మాజీ ఎంపిటిసి కె.తావునాయక్, శాఖ కార్యదర్శి కందుల శ్రీరాములు పార్టీ నాయకులు బట్టు జంగయ్య, కె.కుమార్, పంతునాయక్, భాస్కర్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలు అందించడమే కాంగ్రెస్ లక్ష్యం

-కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జ్ ఎనుముల తిరుపతిరెడ్డి



కొడంగల్‌లో మున్సిపల్ పార్క్‌ను ప్రారంభిస్తున్న తిరుపతిరెడ్డి

**కొడంగల్, జూన్ 12, ప్రభాతవార్త:** అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా సిఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తున్నదని కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జ్ ఎనుముల తిరుపతిరెడ్డి అన్నారు. గురువారం కొడంగల్ మండలం లోని వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, భూమిపూజ, కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను లబ్దిదారులకు అందించారు. ఈసందర్భంగా రూ. 1కోటి10లక్షల వ్యయంతో ఏర్పాటుచేసిన లాహోటీకాలనీ, శాంతినగర్ కాలనీల్లో పార్కులతోపాటు ఓపెన్ జిమ్‌ను ప్రారంభించి అక్కడే మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. పట్టణంలోని లాహోటీ, శాంతినగర్ కాలనీల్లో హెచ్ఎండిఏ పార్కులను ఆహ్లాదకరంగా నిర్మించిందన్నారు. హైటెక్ హంగులతో సందర్శకులను ఆకట్టుకునేలా తీర్చిదిద్దారని అభి నందించారు. అలాగే స్థానిక ఎంపిడిఓ కార్యాలయ సమీపంలో రూ.45 లక్షలతో డిసిసిబి బ్యాంకు నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం కడా కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో 90మంది లబ్దిదారు లకు రూ.90,10,440 కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను అందజేశారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో తిరుపతిరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర పోలీస్‌హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ ఆర్.గురునాథ్‌రెడ్డి, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా డిసిసిబి అధ్యక్షులు మామిళ్ళ విష్ణువర్ధన్‌రెడ్డి, కడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి, ఎఫ్ఆర్ఓ సత్య, జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేష్‌రెడ్డి, కొడంగల్, బొంరాస్‌పేట్ పిఏసిఎస్ అధ్యక్షులు కట్కం శివ కుమార్‌గుప్త, జయక్రిష్ణ, ఎఎంసి చైర్మన్ అంబయ్యగౌడ్, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు నందారం ప్రశాంత్, కొడంగల్ నయ్యూం, నర్సిములు గౌడ్, అవుటి శేఖం, భీంరెడ్డిలతోపాటు తహసీల్దార్ విజయ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్ తదితరులు పాల్గొన్నారు.

## భూసమస్యలు భూభారతితో పరిష్కారం

**చిన్నశంకరంపేట, జూన్ 12, ప్రభాతవార్త:** ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన ఆర్‌వోఆర్ భూభారతి చట్టంతో భూసమస్యలు పరిష్కార మవుతాయని మెదక్ ఆర్డీవో రమాదేవి అన్నారు. గురువారం మండల పరిధి గవ్వలపల్లిలో నిర్వహించిన భూభారతి సదస్సును పరిశీలించారు. రైతుల వద్ద నుండి తీసుకున్న దరఖాస్తులను పరిశీలించి వెంటనే సమస్యను పరిష్కరించాలని తహసీల్దార్ మన్నన్‌కు సూచించారు.

# పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు

-ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి



ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్‌లను అందజేస్తున్న ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి

**పెద్దేముల్, జూన్ 12, ప్రభాతవార్త:** ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడం జరిగిందని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. గురువారం పెద్దేముల్ మండల కేంద్రం లోని ఎంపిడిఓ కార్యాలయ ఆవరణలో 426 మంది లబ్దిదారులకు ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్ పత్రాలను స్థానిక నాయకులు, అధికారులతో కలిసి ఎమ్మెల్యే పంపిణీచేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్‌లను పంపిణీ చేయడం చాల సంతోషకరమని, ఇది ఒక పండుగ వాతవరణంలా ఉందని అన్నారు. ఈ పండుగకు వరుణదేవుడు కూడా రావడం శుభ సూచకమని అన్నారు. అర్హులందరికీ దశలవారీగా ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని, ఇండ్లు కట్టిన వారికి బిల్లులు ఇప్పించే భాధ్యత తనదేనని అన్నారు. ప్రొసీడింగ్‌లు తీసుకున్నవారు రేపటి నుంచి ముగ్గు పోసి ఇండ్ల నిర్మాణం చేపట్టుకోవచ్చని అన్నారు. కోటపల్లి ప్రాజెక్టు మరమ్మతులకు సిఎం రేవంత్ రెడ్డి, స్పీకర్ ప్రసాద్‌కుమార్ సహకారంతో రూ. 90 కోట్లు మంజూరు చేయించడం జరిగిందని అన్నారు. ఈప్రాజెక్టుద్వారా మండలంలోని దాదా పు 14 గ్రామాల రైతులకు లబ్ది చేకూరుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కల్వ సుజాత, పిసిసి ప్రధాన కార్యదర్శి ధారాసింగ్, కోటపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ అంజయ్య, వైస్‌చైర్మన్ ఎస్.నారాయన్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు ఎల్లారెడ్డి, ఏ బ్లాక్ అధ్యక్షులు లొంక నర్సిములు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పెండ్యాల ప్రవీన్‌కుమార్, యూత్ అధ్యక్షులు మహేష్, యువనాయకులు రుద్రారం మహిపాల్ రెడ్డి, నాయకులు సుమిత్ర రాథోడ్, కోహీర్ రవి, విద్యాసాగర్, కందనెల్లి కిరణ్, కోహీర్ గోపాలక్రిష్ణ, ఆనందచారీ, రాముసాయక్, బాబుసింగ్, తది తరులు పాల్గొన్నారు.

## ఉపాధిహామీ పనులను పరిశీలించిన డిప్యూటి కమిషనర్



వట్టిమీనపల్లి నర్సరీ పరిశీలిస్తున్న కమిషనర్ రవీందర్

**నవాబుపేట, జూన్ 12, ప్రభాతవార్త:** మండల పరిధిలోని యావపూర్, వట్టిమీనపల్లి, మమ్మదాన్‌పల్లి గ్రామాల్లో నిర్వహించిన ఉపాధిహామీ పనులు గురువారం పంచాయతీరాజ్ డిప్యూటీ కమిషనర్ రవీందర్, డిపివో జయసుధ తదితరులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రయోజనాలు సమకూర్చే పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన సూచించారు. యావపూర్‌లో రెవెన్యూ పరిధిలో నిర్మించిన చెక్‌డ్యాం లాంటి వాటితో పాటు చిన్న చెరువులను, రాతికట్టడాలను నిర్మంచడానికి కృషి చేయాలని అన్నారు. నర్సరీల నిర్వహలో తగిన జాగ్రతలు పాటించాలని అన్నారు. ఫాంఫండ్‌ల నిర్మాణాలలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో అనురాధ, ఏపివో లక్ష్మీదేవి, ఎంపివో విజయ్‌కుమార్, ఈసి జ్యోతి, టిఏలు భాస్కర్, విష్ణువర్ధన్‌రెడ్డి, జగదీష్, రవి తదితరులు పాల్గొన్నారు.

## క్రీడాకారుణ్ణి అభినందించిన మాజీ జడ్పీటిసి



క్రీడాకారుడికి మెడల్, సర్టిఫికెట్ అందజేస్తున్న విశాలశ్రవణ్‌రెడ్డి

**కేశంపేట, జూన్ 12, ప్రభాతవార్త:** గ్రామీణస్థాయి క్రీడాకారులను ప్రోత్సహిస్తే ఉన్నతశిఖరాలను అధిరోహిస్తారని కేశంపేట మాజీ జడ్పీటిసి విశాలశ్రవణ్‌రెడ్డి అన్నారు. తెలంగాణ మారథాన్ 5కె రన్ పోటీలలో మేకగూడా గ్రామానికి చెందిన పసుపుల రాయుడు పాల్గొని సిల్వర్‌మెడల్ సాధించాడు. గురువారం విశాలశ్రవణ్‌రెడ్డి క్రీడాకారుడు రాయుడుని అభినందించి మెడల్, సర్టిఫికెట్‌ను అందజేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహిస్తే జిల్లా, రాష్ట్ర స్థాయిలోనే కాకుండా జాతీయస్థాయిలో తమసత్తా చాటి రాష్ట్రానికి, దేశానికి పేరుప్రతిష్ఠలు తీసుకొస్తారని, అందుకు రాయుడు నిదర్శనమని ఆమె అన్నారు. నేటియువతకు విద్యతోపాటు క్రీడలలో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, క్రీడలు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు.

## విమాన ప్రమాదం దిగ్భ్రాంతికరం

**షాద్‌నగర్, జూన్ 12, ప్రభాతవార్త:** అహ్మదాబాద్‌లో జరిగిన విమాన ప్రమాద ఘటన తనను తీవ్రంగా కలిచి వేసిందని మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు విష్ణువర్ధన్‌రెడ్డి, బిజెపి జిల్లా అధికార ప్రతినిధి కక్కునూరి వెంకటేష్‌గుప్తలు వేర్వేరు ప్రకటనల్లో దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అహ్మదాబాద్‌లో కూలిన విమానం సంఘటన అత్యంత దిగ్భ్రాంతికరమని పది మంది సిబ్బందితో పాటు 242 మంది ప్రయాణికులు మృతువాత పడ్డారని, ఇది ఎయిర్ ఇండియా విమానంలో సాంకేతిక లోపాలతోనే ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చని అనుమానం వ్యక్తంచేశారు. చనిపోయిన విమాన ప్రయాణి కులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. చనిపోయిన ప్రయాణికుల కుటుం బాలను కేంద్రప్రభుత్వం ఆదుకోవాలని నవీన్‌కుమార్‌రెడ్డి కోరారు.

## అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు



భూమిపూజ చేస్తున్న మండల అధ్యక్షుడు అశోక్‌కుమార్, తదితరులు

**చౌడపూర్, జూన్ 12, ప్రభాతవార్త:** ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పథకానికి అర్హులైన వారినే ఎంపిక చేస్తామని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎల్వటి అశోక్‌కుమార్ తెలిపారు. పరిగి నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ రామ్మోహన్‌రెడ్డి ఆదేశా లతో, గురువారం మందిపాల్ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీ పథకాలను, హామీలను కూడా నెరవేస్తుందని, ఇందిరమ్మ ఇండ్ల పథకంతో నిరుపేదల సొంతింటి కలను ప్రభుత్వం నెరవేరుస్తుందని అన్నారు. విడతలవారీగా ప్రతి ఒక్క పేదవాడికి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తుందన్నారు. ఈకార్యక్రమంలో ఇందిరమ్మ ఇండ్ల ప్రత్యేక అధికారి ఉపేందర్, ఎంపిడివో సోమలింగం, పిఏసిఎస్ వైస్ చైర్మన్ నాగరాజు. మండల వర్కింగ్ ప్రెసిడెంట్ సలీమ్, గ్రామ పంచాయతీ కార్యదర్శి స్వరూప, శివశంకర్, రాజు, కేశవులు, పుల్లప్ప, సంటి యాదయ్య, యాదయ్య పాల్గొన్నారు.

## ప్రైవేటు పాఠశాలలు వద్దు ప్రభుత్వ పాఠశాలలే ముద్దు

-ఎంఈఓ చంద్రశేఖర్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ చంద్రశేఖర్

**కేశంపేట, జూన్ 12, ప్రభాతవార్త:** ప్రైవేటు పాఠశాలలు వద్దు ప్రభుత్వ పాఠశాలలు ముద్దు అని కేశంపేట ఎంఈఓ చంద్రశేఖర్, ఎంపిడివో కిష్టయ్య అన్నారు. గురువారం కేశంపేట మండల పరిధిలోని పాపిరెడ్డిగూడా, దత్తాయపల్లి గ్రామాలలో బడిబాట కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి, విద్యార్థుల తల్లిదండ్రులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించి, విద్యార్థులకు ఏకరూప దుస్తులను పాఠ్యపుస్తకాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైనవిద్య ఉంటుందని విద్యతోనే పేదరిక నిర్మూలన సాధ్యమవుతుందని ఆయన అన్నారు. నిరుపేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే దిశగా రాష్ట్రం ప్రభుత్వం కృషిచేస్తుందని ఆయన అన్నారు. విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలకు పంపించి నాణ్యమైనవిద్యను పొందేందుకు విద్యార్థులు తల్లిదం డ్రులు ప్రోత్సహించాలని ఆయన విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులతోపాటు విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

### ట్రాక్టర్ల తాళాలు సరెండర్ చేసిన పంచాయతీ కార్యదర్శులు

**ధారూరు, జూన్ 12, ప్రభాతవార్త:** ధారూర్ మండల గ్రామపంచాయతీ కార్యదర్శులు గురువారం ఇంచార్జ్ ఎంపిఓ ఆధ్వర్యంలో ఎంపిడివో నరసింహులుకు గ్రామపంచాయతీ ట్రాక్టర్ల తాళాలు సరెండర్ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా పంచాయతీ కార్యదర్శులు ఆర్థికంగా సమస్యలు ఎదుర్కొంటు న్నారన్నారు. పంచాయతీ కార్యదర్శుల జాయింట్ యాక్షన్ కమిటీ (టిపిఎస్‌జె ఎసి) తరపున ట్రాక్టర్ల తాళాలు సరెండర్ చేయడం జరిగిందని తెలిపారు.

# ఇష్టపడి చదవాలి.. ఉన్నతంగా ఎదగాలి..

-ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

-కుంటబడిలో బడిబాట కార్యక్రమం



విద్యార్థులకు దుస్తులు, పుస్తకాలను అందజేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తదితరులు

**షాద్‌నగర్ రూరల్, జూన్ 12, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రప్రభుత్వం పేదవిద్యార్థుల భవి ష్యత్తు కోసం నిరంతరం కృషిచేస్తుందని, విద్యా ర్థులు ఇష్టపడి చదివి ఉన్నతంగా ఎదగాలని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న బడిబాట కార్యక్రమంలో భాగంగా గురువారం షాద్‌నగర్ పట్టణంలోని కుంటబడిలో ప్రధానోపాధ్యాయు రాలు భాగ్యమ్మ ఆధ్వర్యంలో విద్యార్థులకు పుస్త కాలు, యూనిఫామ్స్, నోట్‌బుక్స్ పంపిణీచేసే కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. ఈకార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ఎంఈఓ మనో హర్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సంద ర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను పాఠశాల అధ్యాపక బృందం, విద్యార్థినీవిద్యార్థులు సాదరం గా ఆహ్వానించి పూలమాలతో శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉత్తమవిద్యను పొందవచ్చునని విద్యార్థులకు సూచించారు. ఈసందర్భంగా గత విద్యా సంవత్స రంలో స్థానికపాఠశాలలో చదివిన విద్యార్థులు ఉత్తమప్రతిభ కనబర్చి 10ఫలితాల్లో మంచిమార్కు లు సాధించడంతో వారిలో రాంచరణ్, గణేష్, స్నేహా, శివ, మనోహర్‌లకు నగదు ప్రోత్సాహక బహుమతి అందజేసి ఘనంగాసత్కరించారు. అదే విధంగా 25-26సంవత్సరానికిగాను విద్యార్థులకు పుస్తకాలను, నోట్‌బుక్స్, యూనిఫామ్‌లను అంద జేశారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బాబర్‌ఖాన్, తిరుపతిరెడ్డి, ఎండి ఇబ్రహీం, కొమ్ముకృష్ణ, యువనేతలు కొప్పునూరి ప్రవీణ్, ఖదీర్, పాఠశాల అధ్యాపక బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థినీవిద్యార్థులు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు ఉచిత రేషన్ బియ్యం పంపిణీ

-కేంద్ర ప్రభుత్వందేబిజెపి మండల ఇన్చార్జ్ రఘురాం గౌడ్



సన్నబియ్యం పంపిణీ చేస్తున్న బిజెపి నేతలు

**కేశంపేట, జూన్ 12, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని నిరుపేద ప్రజలకు ఉచిత రేషన్ సన్నబియ్యం పంపిణీ పథకం కేంద్రప్రభుత్వం అందిస్తుందని బిజెపి కేశంపేట మండల ఇన్చార్జ్ రఘురాంగౌడ్ అన్నారు. గురువారం కేశంపేట మండల పరిధిలోని బైర్కాన్‌పల్లి గ్రామంలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ పేదలకు ఉచిత రేషన్ బియ్యం పథకంలో భాగంగా ప్రతి నిరుపేద కుటుంబానికి మూడు నెలలకు సరిపడు సన్నబియ్యం ఒకేసారి పంపిణీచేసే కార్యక్రమానికి బూత్ అధ్యక్షుడు సామ శంకర్‌రెడ్డి, బిజెపి మండల అధ్యక్షురాలు రాధిక ఆధ్వర్యంలో ఉచిత రేషన్ బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో, బిజెపి నాయకులు దన్నెడి కుమార్‌యాదవ్, మాజీ బూత్ అధ్యక్షులు గోగికర్ నర్సింగ్, కొట్టం అశోక్‌రెడ్డి, గాదెకాడి నరసింహ, హర్ష, లడ్డు, మన్నెమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

-మండల విద్యాధికారి రాంచందర్



పుస్తకాలు యూనిఫామ్స్ అందజేస్తున్న మండల విద్యాధికారి

**చౌడపూర్, జూన్ 12, ప్రభాతవార్త:** చౌడపూర్ మండల పరిధిలోని మందిపాల్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నూతన విద్యాసంవత్సరం ప్రారంభం సందర్భంగా మండల విద్యాధికారి రాంచందర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్త కాలు, ఏకరూప దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిపిఎం రామ్మూర్తి, స్పెషల్ ఆఫీసర్ ఉమేష్, ఎంపిడివో సోమలింగం, పిఏసిఎస్ వైస్‌చైర్మన్ నాగరాజు, మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు ఎల్వటి అశోక్, అమ్మ ఆదర్శ పాఠశాల మండల అధ్యక్షురాలు సంటి యాదమ్మ, ప్రధా నోపాధ్యాయులు ప్రవీణ్, చైర్మన్ శివలీలా, శివశంకర్, సలీం, నర్సింలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అంతరాష్ట్ర దొంగను అరెస్ట్‌చేసిన పోలీసులను అభినందించిన ఎస్పీ నారాయణరెడ్డి



ఎస్ఐ అరుణ్‌కుమార్ సిబ్బందిని అభినందిస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి

**నవాబుపేట, జూన్ 12, ప్రభాతవార్త:** ట్రాన్స్‌ఫార్మర్ల అపహరణకు సంబంధించి 30 కేసులు ఉన్న అంతరాష్ట్ర దొంగను ఉత్తర్‌ప్రదేశ్‌లో అరెస్ట్ చేశారు. ఈసందర్భంగా గురువారం ఎస్పీ నారాయణరెడ్డి ఎస్ఐ అరుణ్‌కుమార్ సిబ్బందిని అభినందించారు. ఆయా మండలాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల ధ్వంసం చేసి వాటిలో ఉన్న విలువైన రాగితీగను విక్రయించుకుకోవడానికి అలవాటుపడిన ఉత్తర్ ప్రదేశ్‌కి చెందిన నందులాల్‌రాజ్‌బార్‌పై అరెస్ట్ వారెంట్ ఉన్న తరుణంలో తప్పించుకుని తిరుగుతున్నాడు. నవాబుపేట ఎస్ఐ ఆధ్వర్యంలో ఈ అరెస్ట్ ఆపరేషన్‌ను నిర్వహించి, నందులాల్ రాజ్‌బార్‌ను ఉత్తర్‌ప్రదేశ్‌లో అరెస్ట్‌చేశారు. నందులాల్‌రాజ్‌బార్ అరెస్ట్‌లో కీలకపాత్ర వహించిన ఎస్ఐ అరుణ్‌కుమార్ బృందాన్ని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. రైతులకు కునుకులేకుండాచేసిన దొంగను చాకచక్యంగా పట్టుకున్నందుకు ఎస్పీ ప్రశంసించారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎంతటివారైనా, ఎక్కడ ఉన్నా నేరంచేసి తప్పించుకోవడం సాధ్యంకాదని ఆయన హెచ్చరించారు. నేరప్రవృత్తి జీవితాలను నాశనం చేస్తుందని జీవితాలను నాశనంచేసుకోరాదని హితవుపలికారు. నందులాల్‌రాజ్‌బార్‌తోపాటు నేరాలకు పాల్పడినవారిని కూడా ఎట్టి పరిస్థితుల్లో అయినా అరెస్ట్ చేస్తామని అన్నారు.

## రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోండి

**సిర్గాపూర్, జూన్ 12, ప్రభాతవార్త:** ఈ నెల 6వ తేదీ వరకు కొత్త పట్టా పాసుపుస్తకాలు అందుకున్న అన్నదాతలు రైతు భరోసా కోసం ధరఖాస్తులు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి హరికృష్ణ తెలిపారు. ఈ నెల 29వ తారీఖు వరకు ధరఖాస్తులు చేసుకుంటే రైతు భరోసాను అందుకుంటారన్నారు. రైతులు తమ పట్టాపాసుపుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంక్ పాస్‌పుస్తకం జిరాక్సు పత్రాలతో ధరఖాస్తు పత్రాన్ని పూర్తి చేసి స్థాని ఎఈఓలకు అందచేయాలన్నారు.

## కురుమ సంఘం మండల అధ్యక్షుడిగా రమేష్

**పుల్‌కల్, జూన్ 12, ప్రభాతవార్త:** కురుమ సంఘం అధ్యక్షుడిగా మండల పరిధిలోని ముదిమాణిక్యం గ్రామానికి చెందిన పడమటి రమేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కేంద్రమైన పుల్‌కల్‌లో గురువారం కురుమ సంఘం కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించగా మండంలోని ఆయా గ్రామాలకు చెందిన కురుమ సంఘం అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, సభ్యులు హాజరై మండల కమిటిని ఎన్నుకున్నారు. కమిటి అధ్యక్షులు రమేష్‌ను రెండవమారు ఎన్నుకు న్నారు. ఉపాధ్యక్షులుగా చిట్కల రాజు (మిన్‌పూర్), ప్రధాన కార్యదర్శిగా దస్తయ్య(సింగూరు)లను ఎన్నుకున్నారు. గొల్ల కుర్మలు రాజకీయంగా ఎదిగేందుకు కృషి చేస్తామని, గొల్ల కురుమల ఇండ్లలోని బడిఈడు చిన్నారి విద్యను అందుకునేలా కుటుంబ సభ్యులు చొరవ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బిజెపి మండల అధ్య క్షుడు అమ్మల నీవన్ కురుమ, సంఘం నియోజకవర్గ యువత అధ్యక్షులు ఇందూరి మోహన్, బీసీ యువజన సంఘం మండల అధ్యక్షులు అత్కూరి రవీందర్, మాజీ అధ్యక్షులు ముత్తగారి నర్సింలు, నాయకులు గొల్ల బాబయ్య, సొసైటీ మాజీ డైరెక్టర్ బేలూరి సంగయ్య పాల్గొన్నారు.

అశోక్ సింగల్ శిశుమందిర్ లో..

## గాయత్రి యజ్ఞం, సరస్వతి పూజ

**రామాయంపేట మున్సిపాలిటీ, జూన్ 12, ప్రభాతవార్త:** పట్టణంలోని అశోక్ సింగల్ శిశుమందిర్ పాఠశాలలో గాయత్రి యజ్ఞం జరిగింది. పాఠశాల పునః ప్రారంభ సందర్భంగా గురువారం సరస్వతి పూజ నిర్వ హించారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యక్షులు గంగం శ్రీను, ఏనిశెట్టి రమణ, మైలవరం రుచిత, వంగరి శ్రీశైలం, దారం శంకర్, రఘుపతి గౌడ్, ఏలూరి పండరినాథ్, మహేష్, చిలుక రమాకాంత్, రజిత తదితరులు ఉన్నారు.

## వైద్య బృందం ఆధ్వర్యంలో వాకథాన్

**సిద్దిపేట అర్బన్, జూన్ 12,ప్రభాతవార్త :** నేషనల్ సర్జన్స్ వీక్ ఈనెల 9 నుంచి 15 వరకు నిర్వహిస్తున్న కార్యక్రమాలలో భాగంగా గురువారం సిద్దిపేటలో సురభి మెడికల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ కళాశాల ఆధ్వర్యంలో డాక్టర్స్, మెడికల్ సిబ్బంది వాకథాన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా సిద్దిపేట బిజెఆర్ చౌరస్తా నుంచి పాత బస్టాండు అంబేడ్కర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో డీన్ డాక్టర్ రఫీ, సర్జరీ ప్రొ॥ ఐలయ్య, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సిద్దిపేట అధ్యక్షులు, తదితరులున్నారు.